నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 11 మార్చి 2024 | MAHABUBNAGAR NARAYANPET


బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన పరమేశ్వరస్వామి ఆలయం

## భక్తుల కొంగుబంగారం
# పరమేశ్వరుడు

- ఆత్మకూరుచెరువులో స్వయంభూవుగావెలిసినఆత్మలింగం
- ఆదినుంచిచరిత్రకెక్కినఆలయం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు షురూ

ఆత్మకూరు, మార్చి 10 : కొలిచిన భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు ఆత్మకూరు పరమేశ్వరుడు. ఆత్మకూరు మండలకేంద్రంలోని చెరువులో ఆత్మలింగం స్వయంభూవుగా వెలిసిందని చరిత్ర చెబుతున్నది. అత్యంత మహిమానిత్వం కలిగిన ఈశ్వరుడు సంస్థానాల కాలం కంటే ముందే ఇక్కడ వెలిశాడు. అప్పటికే ఆలయం ఏర్పడిన పరిస్థితుల్లో రాజులు మండపం నిర్మాణంతో ఆధునీకరించారు. స్వయంభూగా వెలిసిన పరమ శివుడిగా ఈ ప్రాంత ప్రజలకు ఆదినుంచి ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నాడుహ రహరుడు.

### ఆలయ ప్రాశస్త్యం..

భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న పరమేశ్వరస్వామి ఆలయం శతాబ్దాల కిందట నిర్మించబడింది. మొదట్లో గోపాల్‌పేటకు చెందిన గాజుల వ్యాపారులు తమ కోరికలు తీరిన సందర్భంలో గర్భగుడిని నిర్మించారు. ఆ తర్వాత 1730లో రాజా తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గుడి మండపం నిర్మించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా గంగా, గౌరి సమేతంగా పరమేశ్వరుడు ఇక్కడ కొలువుదీరాడు. ఆ నాటి నుంచి భక్తుల ఇలవేల్పుగా, కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామివారు వెలుగొందుతున్నాడు. ఘనమైన చరిత్ర కల్గిన ఆలయం ప్రస్తుతం నిర్వహణ నోచుకోవడం కష్టతరంగా మారింది. శతాబ్దాల కిందట నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకున్నది. ఆదరణ కరువవుతున్న నేపథ్యంలో గుడిని పట్టించుకునే దిక్కులేదు. వందల యేండ్ల కింట నిర్మించిన ఆలయం నిత్యం చెరువులో ఉంటున్నా చెక్కు చెదరని కళాఖండంగా నిర్మాణం జరిగింది. కేవలం బ్రహ్మోత్సవాలప్పుడు మాత్రమే ఆలయానికి సున్నాలు వేయడం, అలంకరించడం జరుగుతుందే.. తప్పా నిర్వహణ కష్టతరంగా మారింది. వంశ పార్యంపరంగా ఆర్జిత సేవలందిస్తున్న పూజారుల కుటుంబాలు పూట గడవడం కూడా గగనమైపోయింది. ప్రతియేటా మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1986ముందు వరకు అత్యంత వైభవంగా జరిగిన ఆత్మకూర్ జాతర మహోత్సవం అప్పటి నుంచి అంతరించిపోయింది. దాదాపు పదేండ్లు పైబడి వచ్చిన కరువుతో జాతర వైభవాన్ని పూర్తిగా కోల్పోయింది. ప్రస్తుతం పాలక ప్రతినిధు లు, దాతల సహకారంతోనే జాతర మహోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా ఆలయం శిథిలావస్థకు చేరిన పరిస్థితుల్లో అప్పటి పాలకులు ఆలయ పునర్నిర్మాణం చేపడతామని పట్టించుకోలేదు. ఓ దశలో పూర్తిగా శిథిలమైన పరిస్థితుల్లో గర్భగుడి మరమ్మతులు నిర్వహించేందుకు పూనుకొని ఏనిమిదేండ్లు కావొస్తున్నా అసంపూర్తిగానే వదిలేశారు. పట్టించుకునే వారు కరువై, అడిగే నాథుడు లేకపోవడంతో నామమాత్రంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు పాలకులు సమాయత్తమయ్యారు.


గంగా, గౌరీ సమేతంగా కొలువుదీరిన పరమేశ్వరుడు

### సర్వం సిద్ధం..

నేటి నుంచి పరమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు మున్సిపల్ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 11న మొదటి తేరు, 12న రెండో తేరు, 13న మూడో తేరు (రథోత్సవం) నిర్వహించనున్నట్లు పాలక ప్రతినిధులు ప్రకటించారు. దాదాపు 15రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకొని దాసంగాలు సమర్పిస్తారు. ఇప్పటికే జాతరను పురస్కరించుకొని మిఠాయిల దుకాణాలు, చిన్నపిల్లలు ఆడుకునే పలు ఆటల పరికరాల షాపులను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా స్థానిక ఎస్సై నరేందర్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## అడవుల రక్షణ అందరి బాధ్యత

- పీసీసీఎఫ్‌రా కేశ్‌మోహన్‌దొ బ్రియాల్


సమావేశంలో మాట్లాడుతున్నపీ సీసీఎఫ్‌రా కేశ్‌మోహన్‌దొ బ్రియాల్

అమ్రాబాద్, మార్చి 10 : అమ్రాబాద్ టైగర్ రిజర్వు అడవి రక్షణ మనందరి బాధ్యత అని పీసీసీఎఫ్ రాకేశ్‌మోహన్ దొబ్రియాల్ అన్నారు. ఆదివారం మండలంలోని దోమలపెంట గ్రామ పీసీసీఎఫ్ క్యాంప్ కార్యాలయంలో అటవీ రక్షణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఆర్ పరిధిలో నిత్యం అడవులు ఆహుతి అవుటకు గల కారణాలను అడిగి తెలుసుకొని అడవిలో నివసిస్తున్న చెంచులను గ్రామాల తరలింపునకు, వారి రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అదేవిధంగా వన్యప్రాణులకు ఎలాంటి హాని కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. అడవులు అగ్నికి ఆహుతి అవ్వకుండా ప్రొటెక్షన్ చేపట్టాలని సూచించారు. వాచర్లు, ఉద్యోగులు ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలు జరిగినా సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి, అచ్చంపేట, నాగర్జునసాగర్, నల్గొండ జిల్లాలకు సంబంధించిన ఎఫ్‌డీవోలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల వలకు చిక్కిన భారీ చేప


పస్పుల సమీపంలోని కృష్ణానదిలో వలలో చిక్కిన భారీ చేపను చూపుతున్న మత్స్యకారులు

మక్తల్ అర్బన్, మార్చి 10 : వలలో భారీ చేప చిక్కినట్లు మత్స్యకారులు తెలిపారు. ఆదివారం మక్తల్ మండలం పస్పులలో కృష్ణానదిలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా దాదాపు 30కిలోల వాలుగ రకానికి చెందిన చేప వలకు చిక్కింది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ 30 కిలోల చేప అరుదుగా లభిస్తుందని, వీటికి మంచి ధర ఉంటుందన్నారు. భారీ చేప వలకు చిక్కడంపై మత్స్యకారులు మల్లేశ్, అశోక్, పరశురాములు, ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు.

## దశకంఠుడిపై నీలకంఠుడు

- పారువేటలో శివపార్వతులు
- వైభవంగా రావణ వాహనసేవ
- తరించిన భక్తాదులు
- అలంపూర్‌లో వైభవంగా ఉత్సవాలు


అలంపూర్‌లో దశకంఠుడి వాహన సేవలో నీలకంఠేశ్వరుడు

అలంపూర్, మార్చి 10 : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజైన ఆదివారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దంపతులు రావణ వాహనంపై ఊరేగారు. ఉదయం నుంచి నిత్య పూజా హోమాలు, బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఆది దంపతులను రావణ వాహనంపై ఊరేగించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి రథంపై ఊరేగించారు. ఆది దంపతులు పురవీధుల గుండా విహరిస్తుంటే భక్తులు చూసి తరించిపోయారు. సాక్షాత్తు భగవంతుడే తమ ఇండ్లకు వచ్చినంత సంతృప్తిని పొందారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో పురవీధులన్నీ మార్మోగాయి.

**అశ్వవాహన సేవ..**

ఆదివారం సాయంత్రం ఆది దంపతులైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరుల ఉత్సవ మూర్తులను అర్చకులు, భక్తులు అశ్వవాహనంపై ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన చిన్న రథంపై ఉత్సవ మూర్తులను ఉంచి పూలతో అలంకరించి పురవీధుల గుండా మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. స్వామి అమ్మ వార్లకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. రథం ముందుకు సాగుతుండగా భక్తులు అర్చకుల పాదాలు కడిగి ముడుపులు చెల్లించుకున్నారు.

**రుద్ర హోమం..**

ఉత్సవాల్లో భాగంగా శివాలయంలో అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు రుద్రహోమం నిర్వహించారు. శివాలయంలోని నందీశ్వరుడి సన్నిధిలో నిర్వహించిన ఈ హోమంలో భక్తులు అధిక సం ఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ఆలయ ఈ వో పురేందర్‌కుమార్, జోగుళాంబ సేవా సమితి అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ఆలయ అర్చకులు ఆనంద్‌శర్మ, ధనుంజయశర్మతోపాటు భక్తులు పాల్గొన్నారు.


శ్రీరామ కొండపై భారీగా క్యూలో నిల్చున్న భక్తులు

# కొండంత జనం

- శ్రీరామకొండకు లక్షకుపైగా..
- ఆదివారం అమావాస్యతో కిటకిట
- ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి బారులు
- స్వామి దర్శనంతో పరవశం

కోయిలకొండ, మార్చి 10 : జిల్లాలో ప్రసిద్ధి చెందిన స్వయంభూ రామపాద క్షేత్రం శ్రీరామకొండ జనసంద్రంగా మారింది. ఆదివారం అమవాస్యను పురస్కరించుకొని తెలంగాణ నలుమూల నుంచి లక్షలాదిగా భక్తులు రామదర్శనానికి తరలివచ్చారు. తెల్లవారుజామున 2గంటల నుంచే రామదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి క్యూలో నిలబడి రామపాదాన్ని దర్శించుకున్నారు. రామకొండలోని మహిమాన్విత మైన కోనేరులో స్నానం ఆచరించి కోనేటి నీటితోపాటు కొండపై ఉన్న వనమూలికలను తమ వెంట తీసుకెళ్లారు. భక్తుల కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లోని నవోదయ ఆసుపత్రి, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్థానిక ఎస్సై రాఘవేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సమన్వయ కర్త రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాముడి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

## శ్రీశైలం.. ఉత్సవ శోభితం

- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాలు


జలాభిషేకంలో మల్లికార్జునుడు

శ్రీశైలం, మార్చి 10 : శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పదకొండో రోజు పంచాహ్నిక దీక్షతో నిత్యం భ్రమరాంబిక మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు, అలంకారాలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చండీశ్వరస్వామికి షోడశోపచార క్రతువులు చేసిన అనంతరం ఈవో పెద్దిరాజు, చైర్మన్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో రుద్రహోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచన పూజాధికాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ పుష్కరిణిలో వైదిక శాస్త్రోక్త అవబృతస్నానం చేయించిన తర్వాత వసంతోత్సవాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి రోజున స్వామిఅమ్మవార్లకు కల్యాణం జరిపిన తరువాత సంప్రదాయం ప్రకారం పార్వతీదేవికి మెట్టెలు నల్లపూసలు సమర్పించే నాగవల్లి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యకల్యాణ మండపంలో సదస్యం జరిగిన తరువాత ఉత్సవ మొదటిరోజు దేవతాహ్వానానికి ధ్వజపట అవరోహణ కార్యక్రమం నిర్వహించారు.

**పట్టువస్త్రాలు సమర్పణ..**

శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి నుంచి శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాలు సమర్పించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. మార్చి 3నుంచి 16 వరకు జరిగే శ్రీకాళహస్తీశ్వర బ్రహ్మోత్సవాలకు ఆదివారం శ్రీశైల దేవస్థానం తరపున ఏఈవో మోహన్ అర్చక వేదపండితులు పట్టుపస్త్రాలను సమర్పించారు. సోమవారం భ్రామరి, మల్లికార్జునుడికి ఆశ్వవాహన సేవ ఉంటుందని ఈవో తెలిపారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో నాగేశ్వరరావు అర్చకవేద పండితులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న అధికారులు

## శ్రీనివాసా.. గోవిందా..

- పులకించిన అమ్మాపూర్‌లోని కురుమూర్తి కొండలు
- భారీగా తరలొచ్చిన భక్తులు


కురుమూర్తి స్వామి దర్శనానికి క్యూలో భక్తులు

దేవరకద్ర రూరల్, (చిన్న చింతకుంట) మార్చి 10 : చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని సప్తగిరుల్లో ఒకటైన కాంచన గుహలో కొలువుదీరిన కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు భారీ సంఖ్యలో కొండకు తరలివచ్చారు. ఆలయ అర్చకులు నిత్య కైంకర్యాలతో పాటు అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు, దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవింద నామస్మరణతో కురుమూర్తి కొండలు మార్మోగాయి. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.


కురుమూర్తి ఆలయ ముఖద్వారం వద్ద భక్తులు

## మల్లన్నకు బ్రహ్మాండోత్సవం


జాతర ప్రాంగణంలో శకటోత్సవ ర్యాలీ, బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

- కుమ్మెర జాతర ప్రారంభం
- మల్లికార్జునుడికి బోనాలతో మహిళా భక్తుల నైవేద్యం
- ఆకట్టుకున్న శకటోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

నాగర్‌కర్నూల్, మార్చి 10 : మండలంలోని కుమ్మెర భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బండ్లు, బోనాల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం మల్లికార్జున స్వామి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. రాత్రి సమయంలో యాదవులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివా రం అమావాస్య కావడంతో ఉత్సవాలకు భక్తజనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా 11న ఉదయం 11 గంటలకు బిందె సేవ, 12న శివ పార్వతుల కల్యాణోత్సవం, 13న స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

- రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

మూసాపేట(అడ్డాకుల), మార్చి 10 : రోడ్డు దాటుతుండుగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న హోంగార్డు దండు రాథోడ్ (42) మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. కాగ అతను ఆదివారం రాత్రి అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ శివారులో ఉన్న దాబా వద్దకు భోజనం చేసేందుకు వచ్చి, భోజనం ముగించుకొని తిరిగి మహబూబ్‌నగర్‌కు వెళ్లేందుకు వేరే వాహనం ఎక్కేందుకు కాళినడకన రోడ్డు దాటుతున్నట్లు తెలిపారు. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తే గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్లు తెలిపారు. అతనికి తీవ్ర గాయాలై అక్కడికి అక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి వస్తుంది.

## ముగిసిన షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు

వనపర్తి టౌన్, మార్చి 10 : వనపర్తి జిల్లా కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్‌లో నర్సిరెడ్డి, శంకరమ్మల స్మారకార్థం రెండురోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో సింగిల్స్ విభాగంలో విన్నర్‌గా మహబూబ్‌నగర్‌కు చెందిన జేషన్, రన్నరప్‌గా వనపర్తికి చెందిన యక్షిత్‌లు నిలిచారు. ప్రథమ బహుమతిగా రూ.25వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.15వేల నగదును అందజేశారు. అ దేవిధంగా డబుల్స్ విభాగంలో విన్నర్‌గా జోయెల్ అండ్ భాను నిలువగా రూ.40వేల నగదు, రన్నరప్‌గా జావెద్ అండ్ ఆసిఫ్‌లు నిలువగా రూ.20 వేల నగదు బహుమతులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆవుల రమేశ్, చీర్ల భాస్కర్, వరప్రసాద్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బలరాం ఉన్నారు.


బహుమతులుఅం దజేస్తున్న ప్రజాప్రతినిధులు